1. అందరి మదిలో అనురాగాన్ని నింపి
అలజడులను పారదోలిన అపురూపమూర్తికి వందనం

2. ఆత్మబంధువుల్లారా అనే సంబోధనతో భక్తులలో
ఆత్మీయతను నింపిన ఆత్మజ్ఞానికి వందనం

3. ఇహలోక ఇక్కట్లను పారద్రోలి
పరమానందాన్ని పంచిపెట్టిన పావనమూర్తికి వందనం

4. ఈ జన్మ పరమార్థాన్ని విపులంగా విశదపర్చి
మా హృదయాలలో పదిలపర్చిన పవిత్రమూర్తికి వందనం

5. ఉనికిలేని మనస్సును పదునైన మాటలతో పలుచన చేసి
పారవశ్యం నింపిన సుగుణాభి రామునికి పాదాభివందనం

6. ఊయలలో పిల్లవాడికి జోలపాడి నిద్రపుచ్చే తల్లిలా
ఊరటనిచ్చే మాటలతో బాధలను మైమరపించే భానుమూర్తికి వందనం

7. ఋగ్వేదం నుండి ఋషుల వరకు, సామవేదం నుండి సన్యాసుల వరకు
కోకొల్లలుగా ఉదాహరణలతో జ్ఞానాన్ని పంచిపెట్టిన జ్ఞానమూర్తికి వందనం

8. ఎందరో పామరులకు విషయ జ్ఞానాన్ని ఎరుకపర్చి
ఎదలో, మదిలో మలిన పొరలను తొలగించిన మందహాసమూర్తికి వందనం

9. ఏసుక్రీస్తు నుండి సోక్రటీసు వరకు, తులసీదాసు నుండి గాంధీజీ వరకు
సద్గుణాలను తెలియజెప్పి జీవన్ముక్తులను చేయగోరే గురుదేవులకు వందనం

10. 'ఐ'ని వదలమని అదే అన్ని బంధాలకు మూలమని
ముముక్షువులకు ముచ్చటగొలిపే మాటలతో విశదపర్చిన విశ్వమూర్తికి వందనం

11. ఒదిగే గుణం, సహనం జ్ఞానమార్గానికి తొలిమెట్టని అవినయం, అసహనంతో
స్వస్వరూపానికి దూరమౌతారని అతిసరళంగా ఎరుకపర్చిన గుణసాగరునికి వందనం

12. ఓర్వలేని గుణం వదిలిపెట్టమని ఓపికగా విశదపర్చిన
ఓంకారమూర్తికి వందనం.అభివందనం

13. ఔపోసన పట్టిన ఉద్గ్రంథాలలోని ఋూటలను ఉగ్గుపాలవలె
రంగరించి ఊరడించిన ఉజ్వలమూర్తికి వందనం

14. అందరిలో ఒకరిలా కనిపించే ఈ మాంసనేత్రాలకు
జ్ఞాననేత్రాలతో లోచూపు నేర్పించే లోకబాంధవునికి వందనం

15. 'అః' అనిపించే రూపలావణ్యంతో అందరి మదిలో నిలిచే
అద్వితీయమూర్తికి హృదయాభివందనం

16. కన్నవారింటికి వచ్చిన అనుభూతిని పొందేట్లు
ఆదరించి అభిమానించిన నాన్నగురుదేవులకు వందనం

17. కాకుల వంటి లోకులకు కమనీయమైన మాటలతో
కాకులను కోకిలలుగా మార్చిన కారుణ్యమూర్తికి వందనం

18. కించిత్ భేషజము లేక క్రిందికి దిగజారే శిష్యరేణువులను
ఆప్యాయంగా ఆదరించి అక్కున చేర్చుకునే ధీరోదాత్తునికి వందనం

19. క్రీగంటి చూపులతో కన్నీళ్ళను కరిగించి
కలిమిలేములనే భేదంబులేక కడుపార పలకరించే కరుణామయునికి వందనం

20. కృపాకటాక్షాలే గవాక్షాలై కడుజాగరూకతతో
ఆదరించే కడు రమణీయమూర్తికి వందనం

21. కుందనపు బొమ్మలాంటి మేనిఛాయతో మనో కురూపుల్లాంటి
మమ్ములను చేరదీసిన ఔన్నత్యమూర్తికి వందనం

22. కూపస్థ మండూకాలను సాగరతీరపుటంచులకు
చేర్చిన విశాలహృదయునికి వినయపూర్వక వందనం

23. కెరటంలోనున్నది నీరేనని కెరటంగా చూడవద్దని
ఆత్మనుండి నీవు వేరుకాదని నిశితంగా విశదపర్చిన నిత్యానందమూర్తికి వందనం

24. కేవలం ఉన్నది నీవే ఆత్మగానేనని ఎరుకపర్చి
ఆత్మకు భిన్నమైన నేనుకు ఉనికి లేదని తేటపర్చిన హృదయేశ్వరునికి వందనం

25. కైలాసంలోనున్న శివుడు, నీ హృదయంలోనున్న సద్వస్తువు వేరుకాదని
ద్వైతభావన వీడాలని అజ్ఞానులైన మాపై జ్ఞానకిరణాలను ప్రసరించే జ్ఞానబాంధవునికి వందనం

26. కొబ్బరినీళ్ళవంటి తియ్యనైన మాటలతో, కొబ్బరిపెంకువంటి
కఠినమైన ఉపనిషత్ భావజాలాలను విపులంగా విశదపర్చిన వసుదైకమూర్తికి వందనం

27. కోరికలు దుఃఖహేతువులని, దుఃఖనివారణకు మార్గమున్నదని
సిద్ధార్థుడు బుద్ధుడైన వైనాన్ని, విశదపర్చిన జ్ఞానబోధకునికి వందనం

28. కంఠంలోనున్న మాధుర్యంతో కంటికొనలలో చేరిన కన్నీటిని
తుడిచివైచి కలువ శోభితులుగా మార్చిన కదురమ్యమూర్తికి వందనం

29. గద్గద స్వరంతో వేడుకునే గమ్యంలేని బాటసారులకు
మృదువైన ఆధ్యాత్మికబాటని చూపిన మార్గదర్శకునికి వందనం

30. ఘనమైన కీర్తికాంక్ష బంధహేతువని ఆత్మ ఎఱుకకు
ప్రతిబంధకమని ఘనంగా చాటిచెప్పిన ఘనాపాటికి వందనం

31. టంకశాలలో ముద్రించిన నాణెంకన్న నీ హృదయంలోనున్న సద్వస్తువును
తెలుసుకోవడం మిన్న అని తేటపర్చిన తేజోమూర్తికి వందనం

32. టాటా చెప్పాలి అరిషడ్వర్గాలకని
శాంతితత్వాన్ని ప్రభోదించిన ప్రేమైకమూర్తికి వందనం

33. ధాంబికాన్ని వదిలి నిరహంకారంగా ఉండాలని
నిరాడంబరతను నేర్పిన నిరుపమానమూర్తికి నిత్య వందనం

34. తలంపుల సమాహారమే మనస్సని అది హృదయంలో
అణిగిపోతే శాశ్వత శాంతిని పొందగలమని ఎలుగెత్తి చాటిన శాంతిసాగరునికి వందనం

35. దరహాసంతో దప్పికగొన్న భక్తజన బాహుళ్యం
దప్పిక తీర్చిన ధర్మమూర్తికి వందనం

36. దేహబుద్ధి బందహేతువని, అశాంతికి మూలమని
అజ్ఞాన జనితమైన దేహబుద్ధిని విడనాడమనే వివేకమూర్తికి వందనం

37. నా, నేను అనే తలంపులు దేహతాదాత్మ్య జనితాలని, హృదయంలో సద్వస్తు ఎరుకకు

హృదయపవిత్రత ఉండాలనే చిరుదరహాసునికి వందనం

38. పరిమళ భరితమైన స్వరూపంతో శిష్యగణకోటికి

సుగంధ పరిమళాలు వెదజల్లిన మహోన్నతమూర్తికి వందనం

39. భక్తిమార్గంతో ముముక్షువులు బంధవిముక్తులై

పరమాత్మను చేరవచ్చనే భక్తజనబాంధవునికి వందనం

40. మనస్సును చింతించడమే దాని రూపనాశనమునకు మార్గమని

మనోనాశనమే మోక్షకారకమనే మనోనాశనదార్శనికునికి హృదయపూర్వక వందనం

41. యజ్ఞయాగాదులతో పనిలేదని, యాంత్రిక పూజలు వ్యర్థమని

స్వస్వరూపమెరుకకై ఆత్మవిచారణే శ్రేష్ఠమని విశదపరచిన విశ్వప్రేమికునికి వందనం

42. రజో, తమోగుణాలు బంధహేతువులని, సత్పురుషుల సహవాసంతో సత్వగుణం పొందాలని

సత్సాంగత్యమే స్వస్వరూపజ్ఞానానికి బాటయని భోదపర్చిన సత్సంకల్పమూర్తికి వందనం

43. వాసనాక్షయమై పరిపూర్ణానందం అనుభవంలోకి వచ్చేవరకు

జన్మజన్మలకు గురువు వెన్నంటి ఉంటాడని, వెన్నుతట్టి లేపిన ఔదార్యమూర్తికి వందనం

44. శరణాగతి పొందడమే మోక్షప్రాప్తికి అత్యున్నత మార్గమని

భగవత్సంకల్పమే, భక్తుడిసంకల్పమనే భక్తజనబాంధవునికి భక్తిపూర్వక వందనం

45. సత్పురుషులతో సహవాసం సద్వస్తువు ఎరుకకి పూలబాటయని

సహవాసదోషాలు ప్రతిబంధకాలని సరళమైన మాటలతో చెప్పిన సహజసౌందర్యమూర్తికి వందనం

46. జిన్నూరు వాసిగా, జిజ్ఞాసువులకు అర్థశతాబ్దిగా జ్ఞానకిరణాలను ప్రసరించి

జ్ఞానమార్గాన్ని ప్రభోదించే జ్ఞానసాగరుడు సద్గురు నాన్నగురుదేవులకు పాదాభివందనం

పెద్దిరాజు

డిప్యూటీ కలెక్టర్, విజయవాడ